క్లుప్తంగా

వేడుకల్లో మేయర్ సురేష్ బాబు


పూజలు నిర్వహిస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : కడప నగరం 3వ డివిజన్ శ్రీరామ నగర్ నందు నిర్వహించిన వేడుకల్లో కడప మేయర్ కె. సురేష్ బాబు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీను ఆధ్వర్యంలో కోదండ రామాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కొండయపల్లె, అరవింద్ నగర్ రామాలయాల్లో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నాగేంద్ర, రామలక్ష్మణ్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు మల్లికార్జున, కిరణ్, ఎల్లారెడ్డి, వీరారెడ్డి, మోహన్ రెడ్డి, సాయిమణికం రెడ్డి, హేమంత్, పాపి రెడ్డి, సుధాకర్ నాయుడు, సుబ్బారాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సాయుధ బలగాల కవాతు


కడపలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న కేంద్రసాయుధ బలగాలు, సీఐ, తదితరులు

కడప అర్బన్ : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమని టూటౌన్ సీఐ జి.ఇబ్రహీం తెలిపారు. కడప టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నకాష్, అగాడి, సాయిపేట, వక్కలపేట, యానాది కాలనీలోని ప్రధాన రహదారుల గుండా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ జి. ఇబ్రహీం మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రజలలో భరోసా కల్పించేందుకు, ఎలాంటి అల్లర్లు జరుగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతి భద్రతలను కాపాడడానికి కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో కడప టూటౌన్ ఎస్ఐ సంజీవరాయుడు, పాల్గొన్నారు.

తగ్గుతున్న టమాటా ధర


మార్కెట్‌లో టమాటా గంపలు

కడప అగ్రికల్చర్ : టమాటా ధర తగ్గుముఖం పట్టింది. వారం రోజుల కిందట కిలో రూ. 35 ధర ఉన్న ధర క్రమేపీ తగ్గుతూ వస్తోంది. రైతు బజార్‌లో ప్రస్తుతం కిలో రూ. 16 రుపాయలు పలుకుతోంది. గత వారం రోజుల్లో రూ. 20కి పైగా ధర తగ్గింది. ఇంకా ధర తగ్గు అవకాశం ఉన్నట్లు వ్యాపారులు తెలిపారు.

రక్తదానం చేయండి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా నిలవాలని చెన్నూరుకు చెందిన పొట్టిపాటి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీరామనవమి సందర్భంగా జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లాలోని ఖాజీపేట, చెన్నూరు ఆంజనేయపురంలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల అత్యవసర సమయంలో రక్త నిల్వలు లేక ప్రాణాలు కోల్పోవడం తప్పాలంటే ఖచ్చితంగా యువత సేవా భావంతో రక్తదానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అశోక్, వరప్రసాద్, కాశి, సురేంద్ర, సిరి చందన, ప్రవల్లిక, యుగంధర్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న ఎం. చంద్రశేఖర్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : శంకరాపురానికి చెందిన శ్రీ సూర్య డెవలపర్స్ అధినేత కంచి సురేంద్రనాథ్ జన్మదినం సందర్భంగా కడప నగరంలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదాన కార్యక్రమం, దుప్పట్ల పంపిణీ నిర్వహించారు. శ్రీ సాయి సేవా సంఘం అధ్యక్షుడు మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తిరుమల టింబర్ డిపో అధినేత కంచి గోపీక్రిష్ణ, శంకరాపురం అశోక్, క్రిష్ణారెడ్డి, వల్లీబాషా, శివశంకర్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

పాత్రికేయులకు ఆర్థిక సాయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై తలకు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్న పాత్రికేయుడు నంద్యాల సుబ్బరాయుడుకు సీనియర్ పాత్రికేయులు ముద్దనూరు భాష, రామశేఖర్ రెడ్డి తదితర పాత్రికేయులు రూ.16వేల రూపాయల ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. కడప నగరం 2వ డివిజన్ చలమారెడ్డిపల్లెలోని సుబ్బరాయుడు నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించి నగదు అందజేశారు. పాత్రికేయులు రమేష్, ఆనంద్ రెడ్డి, ఎల్లారెడ్డి, దుర్గాప్రసాద్, ఇరగయ్య, కానగల సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు. ఇరిగేషన్ డీఈ ఖాసింఖాన్, నగర ప్రముఖులు మల్లేశ్వర్‌రెడ్డికి రూ.3వేల చొప్పున అందజేశారు.

కల్యాణం చూసిన కనులదే భాగ్యం

- వైభవంగా సీతారాముల కల్యాణం!
- వేదికల వద్ద కిక్కిరిసిన భక్తజనం
- నగర ఆలయాల్లో కల్యాణ శోభ

కడప కల్చరల్ : అదుగడుగో.. నీలమేఘ శ్యాముడు, దశరథరాముడు కల్యాణమూర్తిగా వేదికపై పెళ్లి పీటపై కొలువుదీరాడు. అదిగో.. ఆ ప్రక్కనే సౌందర్యరాశి ఆదర్శమూర్తి సీతమ్మ పెళ్లి పీటపై ఒదిగి ఒదిగి కూర్చొని ఉన్నారు. ఆ ఇద్దరి ఆదర్శ మూర్తుల కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు ఆ ప్రాంతం, వేదిక కొత్త కళను సంతరించుకుంది. భక్తుల రామ నామస్మరణమధ్య సీతారాముల కల్యాణ వైభోగం భక్తులకు కనువిందు చేసింది.

నగరంలోని అన్ని రామాలయాల్లో శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం కల్యాణోత్సవాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం 10 గంటల నుంచి కల్యాణ కార్యక్రమాలు ప్రారంభించి మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల్లోపుగా ముగించారు. దాదాపు అన్ని ఆలయాల వద్ద భక్తులకు కల్యాణ విందు ఏర్పాటు చేశారు. అన్ని ఆలయాల వద్ద భక్తజనం పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు.

హౌసింగ్‌బోర్డులో..

హౌసింగ్‌బోర్డు కాలనీలోని కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవంలో భాగంగా శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని స్వామి, అమ్మవార్ల మూలమూర్తులతోపాటు ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. కల్యాణ వస్త్రాలతో అలంకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చారు. ఆలయ నిర్వాహకులు దేశు వెంకటరెడ్డి పర్యవేక్షణలో ప్రముఖ వేద పండితుల బృందం కల్యాణ క్రతువును ప్రారంభించారు. గణపతిపూజ, పుణ్యహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ చేయించి వధూవరుల కుటుంబాలకు సంబంధించి ప్రవరలు చెప్పించారు. అనంతరం ఉభయదారులే పెళ్లి పెద్దలుగా వ్యవహరించి కన్యాదానం చేశారు. మహా మంగళ సూత్రానికి శోడషోపచారాలు చేసి భక్తులకు దర్శింపజేశారు. మంగళ వాయిద్యాల మధ్య వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చక స్వాములే స్వామి పక్షాన అమ్మవారి గళ సీమలో మంగళసూత్రాలను అలంకరించారు. అనంతరం ఉత్సాహ భరితంగా అక్షతారోపణ కార్యక్రమం నిర్వహించారు. అందులో వాడిన ముత్యాల తలంబ్రాలను భక్తులందరికీ కల్యాణోత్సవ ప్రసాదంగా పంచి పెట్టగా, వాటి కోసం భక్తులు పోటీపడ్డారు. గాయకులు భక్తిగీతాలను ఆలపించారు. మహిళా భక్తుల బృందాలు శ్రీరాముని పాటలతో కోలాటం ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి నగరానికి చెందిన పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులందరికీ నిర్వాహకులు కల్యాణ విందు ఏర్పాటు చేశారు.

నగరంలోని శ్రీ రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలతో శ్రీరామ నవమిని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి, అమ్మవార్ల అలంకృత మూర్తులను దర్శించుకునేందుకు భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. నగరంలోని అన్ని ఆలయాల వద్ద భక్తుల కమిటీలు, యువత ఆధ్వర్యంలో అన్నదానాలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మొక్కుబడులు గల వారు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. స్థానిక ప్రముఖులు దాదాపు సంప్రదాయ దుస్తులతో స్వామి కల్యాణోత్సవంలో పాల్గొనడం విశేషం.


స్వామి, అమ్మవార్లకు హారతి ఇస్తున్న అర్చకుడు


కల్యాణానికి హాజరైన భక్తులు


భక్తులకు అన్నదానం

సీతారాములకు ప్రత్యేక పూజలు

కడప కల్చరల్ : శ్రీరామ నవమిని పురస్కరించుకుని కడప నగరంలోని శ్రీరాముల బజారులోని రామాలయంలో క్లాత్ మర్చంట్ సభ్యులు బుధవారం విశేష పూజలు జరిపారు. కడప క్లాత్ మర్చంట్ అసోసియేషన్ నగర అధ్యక్షులు శ్రీరాములు, బండి బాబు, హరిప్రసాద్, మురళీకృష్ణ, చలపతి, గోవర్ధన్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం


సంధ్యా సర్కిల్‌లో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి

కడప కార్పొరేషన్ : కడపలోని సంధ్యా సర్కిల్‌లోని సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో ధర్మకర్త మహిమలూరి వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. కమలాపురం శాసన సభ్యులు పి.రవీంద్రనాథరెడ్డి, సీకే.దిన్నె జెడ్పీటీసీ నరేన్‌రామాంజులరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎం.నాగేంద్రప్రసాద్, లోకేష్, హరిక్రిష్ణ, మహిధర్, సిద్దు, చరణ్, సురేష్ పాల్గొన్నారు.

వేడుకలలో డిప్యూటీ సీఎం


శ్రీరామనవమి వేడుకల్లో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని కడప నగరంలోని44వ డివిజన్‌లో జరిగిన వేడుకలలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంజద్‌బాషా మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా పాలన మళ్లీ తెచ్చుకుందాం

ఎన్నికల ప్రచారంలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ప్రజా పాలన మళ్లీ తెచ్చుకుందామని ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ కడప నియోజకవర్గ అభ్యర్థి ఎస్‌బి. అంజద్‌బాషా పిలుపునిచ్చారు. 34వ డివిజన్‌లోని శివలింగం బీడీ ఫ్యాక్టరీ, 36 డివిజన్‌లోని సాయిపేట ప్రాంతాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలు, కన్నీళ్లు కళ్లారా చూసిన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, ఇంటివద్దకే అందజేశారన్నారు.కులమతాలు, పార్టీలకతీతంగా అర్హత కలిగిన వారందరికీ అందించారని తెలిపారు. ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారు జామునే తలుపుతట్టి అవ్వాతాతలకు, దివ్యాంగులకు పింఛన్ ఇచ్చారన్నారు. రహదారులను విస్తరించి, కూడళ్లను అందంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ప్రతి వర్గానికి మేలు చేసిన జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో 36వ డివిజన్ ఇన్‌చార్జి రఫీ, 34వ డివిజన్ ఇన్‌ఛార్జి అలీ, తోట క్రిష్ణ, మున్నా, పవర్ అల్తాఫ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టండి

వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె సురేష్‌బాబు

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, అభివృద్ధి చూసి ఓటేయాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు కోరారు. స్థానిక 14వ డివిజన్‌లోని ప్రకాష్ నగర్, ఏఆర్‌పీ కాలనీ ప్రాంతాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్‌బి. అంజద్‌బాషా, ఎంపీ అభ్యర్థి వైఎస్.అవినాష్‌రెడ్డి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ కార్పొరేటర్ కె.బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ వినోద్, బండిప్రసాద్, సుభాన్‌బాషా, బి.క్రిష్ణారెడ్డి, చల్లా రాజశేఖర్, ఆర్‌పీ.రమణ, లక్ష్మీనారాయణ, మునిశేఖర్‌రెడ్డి, షఫీవుల్లా పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె.సురేష్‌బాబు

పార్కు పనుల పరిశీలన

కడప కార్పొరేషన్ : కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నగర పాలక కమిషనర్ జీఎస్ఎస్.ప్రవీణ్‌చంద్ పరిశీలించారు. టీజీపీ పార్కు, గాంధీ ప్లాజా, మున్సిపల్ స్టేడియం, నానాపల్లె రోడ్, దేవుని కడప ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. టీజీపీ పార్కులో ఎలక్ట్రికల్ కనెక్షన్లు ఇవ్వాలని, పార్కు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గాంధీ ప్లాజాలో ఫౌంటెయిన్ ఏర్పాటు ఏప్రిల్ చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ స్టేడియంలో హాకీ గ్రౌండ్ నిర్మాణానికి ముందు కాలువ నిర్మించాలని, ఫ్లడ్‌లైట్ల ప్రొవిజన్ ఏర్పాటు చేయాలన్నారు. స్కేటింగ్ రింగ్ నందు పనులు వేగవంతం చేసి, అన్నమయ్య జంక్షన్ నుంచి సంజన్న సర్కిల్ వరకూ రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. పాతకడప యూపీహెచ్‌సీ నుంచరి నానా పల్లె హైవే వరకూ 7 మీటర్ల బీటీ రోడ్డు పనిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. దేవునికడప గుడి ప్రక్కన ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న పబ్లిక్ టాయ్‌లెట్లను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.


మున్సిపల్ స్టేడియంలో పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్

శిల్పారామంలో 'నవమి' సందడి



శిల్పారామంలో చిన్నారుల నృత్యాలు

కడప కల్చరల్ : శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కడప శిల్పారామం సందడిగా మారింది. నగర వాసులు ఎండల నుంచి ఉపశమనం పొందడంతోపాటు పండగ ఆనందాన్ని రెట్టింపు చేసుకునేందుకు శిల్పారామానికి విచ్చేశారు. శిల్పారామం ఏఓ మునిరాజు సందర్శకులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. రాత్రి స్థానిక వర్షిణి డ్యాన్స్ అకాడమీ చిన్నారులు తమ ఆటపాటలతో ఆకట్టుకున్నారు.

ఎన్నికల నేపథ్యంలో పటిష్ట నిఘా

కడప నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మధుసూదన్



మాట్లాడుతున్న కడప రిటర్నింగ్ అధికారి మధుసూదన్, కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగానే.. నామినేషన్ ప్రక్రియ ఆరంభం అవుతుంది. ఈ నేపథ్యంలో.. కడప నియోజకవర్గ పరిధిలో నిఘా పటిష్టం చేయాలని కడప నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జీఆర్.మధుసూదన్ సూచించారు. కడప ఆర్డీవో కార్యాలయ సభా భవనంలో 'సాధారణ ఎన్నికలు- 2024'లకు సంబంధించిన అధికారులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్, వీడియో వ్యూవింగ్ టీమ్స్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎన్నికలను సజావుగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి సంసిద్ధం కావాలన్నారు. సర్వైలెన్స్ టీమ్‌ను మూడు షిఫ్టులుగా నియమించి నిర్దేశించిన చెక్ పోస్టుల వద్ద నిఘా ఉంచాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం రాత్రి 10 గంటల నుండే.. నిఘా పర్యవేక్షణా టీములు చర్యలు చేపట్టాలన్నారు. నగదు, బంగారం, మద్యం, ఓటర్లను మభ్యపెట్టే ఇతర వస్తువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ప్రత్యేక నిఘాతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు పాల్పడే వారిపై చర్యలు చేపట్టాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ.. పారదర్శక ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీస్, ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వైలెన్స్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల దాఖలుకు ఏర్పాట్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప అసెంబ్లీ నియోజకవర్గం సంబంధించి నామినేషన్ల దాఖలుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు కడప అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వో, ఆర్డీవో మధుసూదన్ తెలిపారు. ఈ సందర్భంగా అభ్యర్థులు పాటించాల్సిన గైడ్ లైన్స్‌ను ఆయన వివరించారు. కడప అసెంబ్లీ స్థానానికి సంబంధించి ఏప్రిల్ 18న కడప అసెంబ్లీ నియోజకవర్గం ఆర్వో ఎన్నికల నోటీస్ విడుదల చేయడం జరుగుతుందన్నారు. నేటి నుండి 25వ తేదీ వరకు నామినేషన్ పత్రాల స్వీకరణ, 26న పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటాయన్నారు.

ఒక్కో అభ్యర్థి గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్ల పత్రాలు దాఖలు చేయవచ్చన్నారు. గుర్తింపు పొందిన రాష్ట్ర లేదా జాతీయ పార్టీ అభ్యర్థి కోసం అదే నియోజకవర్గంలోని ఓటరు ప్రతిపాదిస్తే సరిపోతుందని తెలిపారు. గుర్తింపు లేని పార్టీ అభ్యర్థి లేదా స్వతంత్రత అభ్యర్థి కోసం అదే నియోజకవర్గంలో 10 మంది ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుందని తెలిపారు.

నేడు మాచునూరులో ఎన్నికల ప్రచారం

పెండ్లిమర్రి : మండలంలోని మాచునూరు గ్రామ పంచాయతీలోని గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించే ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి కుమార్తె డాక్టర్ రమ్యతారెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు.

నేడు ఎన్నికల ప్రచారం

వల్లూరు : మండలంలోని కొప్పోలు గ్రామ పంచాయతీ పరిధిలోని కొప్పోలు, పుత్తచిన్నాయపల్లె, గొల్ల ఓబాయపల్లె గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి వైఎస్ఆర్‌సీపీ ఎన్నికల ప్రచారం జరుగుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల సలహాదారుడు రాజోలు వీరారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. మండలంలోని వైఎస్ఆర్‌సీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

వారసత్వ ప్రాంతాలలో పర్యాటక అభివృద్ధి

కడప కల్చరల్ : జిల్లాలోని వారసత్వ ప్రాంతాలలో ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తే పర్యాటకంగా జిల్లా అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కడప నగరం మునిరావు వీధిలోని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యాలయంలో ప్రచార పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఒక్కసారి పెట్టుబడితో జిల్లాకు ఆర్థికంగా సహాయ పడగలిగే పర్యాటకరంగంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కోటా మృత్యుంజయ రావు, పద్మప్రియ చంద్ర కొండూరు జనార్దన్‌రాజు, హరిభూషణ్ రావు, తదితరులు పాల్గొన్నారు.


వారసత్వ పర్యాటక ప్రాంతాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టూరిజం సంస్థ సభ్యులు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి టీడీపీ శ్రేణులు

వీరపునాయునిపల్లె : మండలంలోని పాయసంపల్లె గ్రామానికి చెందిన పలువురు టీడీపీ శ్రేణులు బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎస్.రవీంద్రారెడ్డి, రాజారెడ్డి, కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కందుల రామకృష్ణారెడ్డి తదితరులను ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. డాక్టర్ రమ్యతారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, రమ్యతారెడ్డి

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం


ఉద్యోగులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సహాయ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బసిరెడ్డి తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బసిరెడ్డి, వారి సిబ్బంది ఆధ్వర్యంలో కొప్పర్తి లోని అల్ డిక్సన్ కంపెనీ ఉద్యోగులకు అగ్ని ప్రమాదాలపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రమాదాలు తలెత్తితే ఎలా ఎదుర్కోవాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ నరేష్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మల్లికార్జున, సేఫ్టీ ఆఫీసర్ కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే పోస్టులు చేస్తే కేసులు నమోదు చేస్తాం

కమలాపురం : రాష్ట్ర ఎన్నికల నియమావళి ప్రకారం, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోషల్ మీడియాలో ఒక పార్టీ నాయకులు, కార్యకర్తలు, మరో పార్టీ నాయకులు, కార్యకర్తలను కించపరిచే, రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే క్రిమినల్ కేసులు పెడతామని ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఎవరైన రాజకీయ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో ఒకరిని మరొకరు కించపరచడం, రెచ్చగొట్టడం, అభ్యంతరం వ్యక్తం చేసే విధంగా పోస్టులు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.